క్లుప్తంగా

సమన్వయంతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఎంపీపీ పుష్పావతి

ఉరవకొండ(విడపనకల్లు): అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి అన్నారు. సోమవారం విడపనకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీటీసీ హనమంతుతో కలసి ఎంపీపీ మాట్లాడుతూ సభ్యులు ఆయా శాఖల మండల అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలు, విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కరించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు సాగుచేస్తున్న రైతులందరికీఈ-క్రాప్ నమోదు చేయాలని , రైతులకు ఆర్‌బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ ఈరమ్మ, వైస్ ఎంపీపీ మోదుపల్లి సునీత, ఈఓఆర్డీ సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కంకాళమ్మదేవి విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో కంకాళమ్మ అమ్మవారు

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప తండాలో సోమవారం కంకాళమ్మదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో మూడు రోజులుగా రుద్రాభిషేకం, గోపుర కలశ స్థాపన, నవగ్రహ, అష్టాక్షాలక హోమం, దుర్గాహోమం, పూర్ణాహుతి, విగ్రహ ప్రతిష్ఠ హోమాలను వేదపండితుడు మంజునాథస్వామి శాస్త్రి బృందం చేపట్టారు. నూతన ఆలయాన్ని సుమారు రూ.14 లక్షల నిధులతో దాతలు, గ్రామస్తులు కలసి నిర్మించారు. ప్రతిష్ఠ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎస్ ఎస్ రామునాయక్, గోవిందునాయక్, రామానాయక్, లక్ష్మానాయక్, తిప్పేస్వామినాయక్, శ్రీనివాసనాయక్, మామునాయక్, పీకానాయక్, పాండురంగనాయక్, నాగరాజునాయక్, మన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి రాజకీయ సమాధి తప్పదు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఉరవకొండ/కళ్యాణదుర్గం రూరల్: రాబోవు ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు రాజకీయ సమాధి కడుతారని, మోదీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. దేశాన్ని కాపాడండి...రాష్ట్రాన్ని రక్షించండి అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సీపీఐ బస్సు యాత్ర సోమవారం ఉరవకొండ, కళ్యాణదుర్గం మీదుగా చేరింది. ఉరవకొండలోని పాత బస్టాండ్‌లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతతత్వ బీజేపీని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, జగదీష్, జాన్సన్‌బాబు, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి గంగాభవాని, చేతి వృత్తిదారుల రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రతి రైతునూ ఆదుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

కళ్యాణదుర్గం: పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం ఎకరానికి రూ.50 వేలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ రెడ్డి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదు లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంటలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అదేవిధంగా హెచ్ఎల్ఎసీ ద్వారా సాగు నీరు అందించేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఫణికుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రంగనాథ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, సీపీఎం నాయకులు రఘు, అశోక్, ఈశ్వర్, సోము, భవిత్, మురళి, ఆంజనేయులు, అమానుల్లా, సిద్ధా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సర్

- ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం
- జగన్‌కు రుణపడి ఉంటామన్న నూతన పింఛన్‌దారులు
- పండుగ వాతావరణంలో పింఛన్ పంపిణీ



కూడేరు: కొర్రకోడులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్ లబ్ధిదారులు



బొమ్మనహాళ్: దర్గాహొన్నూరులో లబ్ధిదారులకు నూతన పింఛన్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కూడేరు/బొమ్మనహాళ్/గుమ్మఘట్ట: 'వైఎస్సార్ పింఛన్ కానుక' నూతనంగా మంజూరైన లబ్ధిదారులు థ్యాంక్యూ సీఎం జగన్ సార్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులతో కలసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ టీడీపీ హయాంలో కేవలం ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవని, జగనన్న సీఎం అయ్యాక అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందుతున్నాయంటూ ఆనందం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను పొందడానికి జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కట్టుబడి పని చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌కు అండగా ఉంటామన్నారు.

- కూడేరు మండలంలోని కొర్రకోడు గ్రామంలో వైఎస్సార్ సామాజిక భద్రతా పింఛన్ పథకం కింద ఈ నెలలో 19 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. సోమవారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. మండల వ్యాప్తంగా 146 పింఛన్లు మంజూరయ్యాయి. సీఎంకు రుణపడి ఉంటామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్‌యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు శివలాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి , వలంటీర్లు పాల్గొన్నారు.
- బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలో 19 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. దర్గాహొన్నూరు సచివాలయ ఆవరణలో సర్పంచ్ వన్నల్లి రామాంజనేయులు, ఎంపీటీసీలు రామకృష్ణ, మనోహర్‌శెట్టి తదితరులు లబ్ధిదారులకు నగదు అందజేశారు. వారు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే పింఛన్ అందుతోందన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్, వైస్ సర్పంచ్ నాగరాజు, వెల్ఫర్ అసిస్టెంట్లు నారాయణ, సుధాకర్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.
- గుమ్మఘట్ట మండల వ్యాప్తంగా 15 గ్రామ పంచాయతీల్లో 328 మందికి సామాజిక భద్రత పథకంలో వైఎస్సార్ పింఛన్ కానుక కింద నూతన పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. త్వరలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు.

96 శాతం 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ

రాయదుర్గంటౌన్: స్థానిక పురపాలకసంఘంలో 96 శాతం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేసినట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో మొత్తం 6,615 మందికి వివిధ రకాల పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉండగా నాలుగో రోజు సోమవారం నాటికి 6,354 శాతం మందికి పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే ఈ నెలలో 178 మందికి మంజూరైన కొత్త పింఛన్లను వలంటీర్లు అందజేస్తుండడంతో అవ్వాతాతల మోహాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇదంతా సీఎం వైఎస్ జగన్ చలువ అని సంతోషం వ్యక్తం చేశారు. కాగా మరో 215 కొత్త పింఛన్ల వెరిఫికేషన్ పూర్తి అయిందని, వారికి కూడా నగదు పంపిణీ చేయనున్నట్లు కమిషన్ తెలిపారు.

ఎమ్మార్సీ భవనం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: 'ఎమ్మార్సీ పైకప్పునకు మరమ్మతులు చేపట్టండి' అనే శీర్షికన సోమవారం సాక్షిలో కథనం వచ్చింది. ఇందుకు ఎంపీడీఓ ఎంకేబాషా స్పందించారు. ఆయన ఎమ్మార్సీ భవనాన్ని పరిశీలించారు. పైకప్పు దెబ్బతినడంతో పెచ్చులూడుతున్నాయని సిబ్బంది వాపోయారు. మరమ్మతులకు ఎంత ఖర్చవుతుందో ఇంజినీర్‌తో అంచనా వేసి పంపాలని మండల విద్యాధికారి చంద్రశేఖర్‌కు సూచించారు.

చురుగ్గా 'రీ సర్వే'

బ్రహ్మసముద్రం: రీ సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ అన్నారు. సోమవారం మండంలోని చెలిమేపల్లి గ్రామ సచివాలయంలో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు భూములు, హద్దులను చూపి భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రీ సర్వేకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్వేయరు మల్లికార్జున, వీఆర్ఓ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తి ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను మంత్రి ఉషశ్రీ చరణ్ దృష్టికి వైఎస్సార్ సీపీ నాయకులు తీసుకెళ్లారు. మంత్రి వెంటనే స్పందించి రూ. నాలుగు లక్షలు సొంతనిధులు వెచ్చించి పైప్‌లైన్ పనులు చేపట్టి, కొళాయిలను ఏర్పాటు చేయించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీటీసీ బూసప్ప, సర్పంచ్ రంగప్ప తాగునీటి కొళాయిలు ప్రారంభించారు. తాగునీటి సమస్య పరిష్కారమైనందుకు గ్రామస్తులు మంత్రి ఉషశ్రీచరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శరణప్ప, జీ తిప్పారెడ్డి, ఈశ్వర్, వన్నూర్ స్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు ఆకస్మిక తనిఖీ



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని చెలిమేపల్లిలో చేపట్టిన ఈ-క్రాప్ నమోదును మండల వ్యవసాయ శాఖ అధికారి సరిత ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ- క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. వేరుశనగ పంట పూత దశలో ఉన్నందున కలుపు తీసిన తరువాత ఎకరాకు 200 కిలోల జిప్సం వేసుకోవాలని సూచించారు. అలాగే రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నందున ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం ఉలవలు , పెసలు , అలసంద విత్తనాలు కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఏఓలు వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లి, నిజవల్లి రెవెన్యూ గ్రామాల్లో పది రోజులుగా జరుగుతున్న 'జగనన్న భూ సర్వే'ను సోమవారం తహసీల్దార్ విజయకుమారి, డిప్యూటీ తహసీల్దార్లు కుళ్లాయప్ప, తిప్పేస్వామి పరిశీలించారు. సర్వేలో పారదర్శకత పాటించాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో 500 ఎకరాల్లో సర్వే పూర్తయిందన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

బెళుగుప్ప: శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ నరసింగప్ప సూచించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సీఐ శేఖర్‌తో కలసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మండల స్థితిగతులు, కేసుల వివరాలపై ఎస్ఐ రామకృష్ణయ్యతో ఆరా తీశారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలన్నారు. మట్కా, జూదం, పేకాటలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

పౌష్టికాహారంపై అవగాహన



మాట్లాడుతున్న సూపర్ వైజర్ ఈశ్వరమ్మ

రాయదుర్గం రూరల్: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని టి.వీరాపురం గ్రామంలో సోమవారం బాలింతలు, గర్భిణులకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఈశ్వరమ్మ పౌష్టికాహార విలువలపై అవగాహన కల్పించారు. పోషకాహార లోప నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ప్రవేశపెట్టి నాణ్యమైన పోషకాలతో కూడిన కిట్లను అందజేస్తోందన్నారు. వివిధ పోషకాలతో కూడిన ఆహార వస్తువులతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన చిత్రం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాధ, హేమలత, సరస్వతి, వనజాక్షి, పంచాయతీ కార్యదర్శి యల్లక్క, ఏఎన్ఎం పార్వతి, ఎంల్‌హెచ్ మహాలక్ష్మి, హెల్పర్లు పాల్గొన్నారు.

అక్కమాంబ ఆలయంలో పూజారుల వాగ్వాదం

కళ్యాణదుర్గం: పట్టణంలోని అక్కమాంబ ఆలయంలో సోమవారం పూజారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆలయ పూజారులైన నాగప్ప, మంగప్ప మధ్య ఆలయంలో హారతి డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. కాగా శ్రావణ సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఇలాంటి తరుణంలో పూజారుల మధ్య వాగ్వాదం భక్తులను విస్మయానికి గురి చేసింది. భక్తితో పూజలందించాల్సిన పూజారులు ఇలా డబ్బుల కోసం వాగ్వాదం చేసుకోవడంతో పలువురు భక్తులు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ చైర్మన్ రాము, గ్రామ పెద్దలు, పోలీసులు జోక్యం చేసుకుని పూజారులతో చర్చించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి

కళ్యాణదుర్గం: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ రాధాకుమారి సూచించారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట చేతికందే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఆముదం పంటలో 10 కిలోల యూరియాను పంటపై భాగంలో వేసుకోవాలన్నారు. దీని వల్ల ఆముదంలో గెల పొడవుగా, గింజ లావుగా ఉండి తూకం ఎక్కువగా రావడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అలాగే తేమ సంరక్షణ పద్ధతిలో భాగంగా పెద్ద నాగలితో సాళ్ల మధ్యన గొడ్డు సాళ్లు తీసుకోవాలన్నారు. బెట్ట పరిస్థితుల నుంచి వేరుశనగ, కంది, ఆముదం పంటలను కాపాడుకోవాలన్నారు. 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 20 గ్రాముల యూరియాను లీటరు నీటిలో కలుపుకుని వారం వ్యవధిలో రెండు సార్లు పంటలపై పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న బాలన్న టిప్పర్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాలన్న సోమవారం వేకువజామున ఇంటి నుంచి బయటకు వచ్చి రోడ్డు దాటుతున్న క్రమంలో తాడిపత్రి వైపు నుంచి టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలన్నను స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సలకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8న స్కూల్ గేమ్స్

కంబదూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8న మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ మండల కోఆర్డినేటర్ చిత్ర ఓబుళేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14,-17 బాల, బాలికల విభాగాలలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, బాల్ బాడ్మింటన్, షటిల్, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో రాణించిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడా సామగ్రిని వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9490360498 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ



ఆర్‌బీకేలో ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ, నాయకులు

ఉరవకొండ: మండలంలోని లత్తవరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఏఓ శుభకర్, సర్పంచ్ పాలడగు వంశీకృష్ణ, నాగరాజునాయక్ ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ చేపట్టారు. ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాలైన ఉలవలను 80 శాతం సబ్సిడీతో అందిస్తుందన్నారు. రైతులు వేరుశెనగ, పప్పుశెనగ లాంటి సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు.

విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

కణేకల్లు: రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ పంట సాగు కోసం వివిధ రకాల విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఏఓ శ్రవణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ప్రభుత్వం అలసందులు, కొర్ర, జొన్న, పెసర తదితర విత్తనాలను సబ్సిడీతో అందజేస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆర్బీకేలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం మండలానికి అలసందులు 80 క్వింటాళ్లు మంజూరయ్యాయన్నారు. ఒక్కో రైతుకు గరిష్టంగా ఐదు ఎకరాల్లో సాగుకు ఐదు ప్యాకెట్లు (ఒక్కో ప్యాకెట్ 10 కిలోలు) ఇస్తామన్నారు. కిలో ధర రూ.108 కాగా 80 శాతం సబ్సిడీ పోరూ రైతులు రూ.21.60 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా శ్రావణ మాస పూజలు



పూలు, యాపిల్ పండ్ల అలంకరణలో జంబుకేశ్వరుడు



సింధూరం అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి



ప్రత్యేక పూజలందుకున్న జోడు లింగాలు

రాయదుర్గంటౌన్: శ్రావణమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కోటలో స్వయంభు జంబుకేశ్వరస్వామికి విశేష అలంకరణలో పూజలు నిర్వహించారు. రంగురంగుల పూలు, యాపిల్ పండ్లతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అర్చకుడు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు స్వామికి విశేష పూజలు, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమ అర్చన, మంగళనైవేద్యాలు చేపట్టారు.

జోడు లింగాలకు ..

కూడేరు: మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి జిల్లా నలమూలల నుంచి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా భక్తుల నోట శివనామ స్మరణ మార్మోగింది. అర్చకులు శివశంకర్‌శాస్త్రి , మహేష్, శివలు జోడు లింగాలకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. భక్తులు జోడు లింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేమకల్లు అంజన్నకు..

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం బ్రహోత్సవాల సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి సింధూరం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో స్వామికి పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక బంగారు కిరీటధారణ, ధ్వజా రోహణం, విష్వక్షన ఆరాధన , స్వస్థ పుణ్యాహవాచనం, ఆచార్య రిత్విక వరణం, ప్రధాన కలశ స్థాపన , ఆవాహనం యాగశాల ప్రవేశం, గోపూజ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

బోధన, సేవలో ఆదర్శం

నేడు ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయుడు దావూద్‌ను సత్కరిస్తున్న జేవీవీ నాయకులు



ఎస్.దావూద్



బాధితుడికి ఆర్థిక సాయం చేస్తున్న బద్దేనాయక్ (ఫైల్)



బద్దేనాయక్



కుట్టుమిషన్లు అందిస్తున్న హెచ్ఎం హేమలత (ఫైల్)



హేమలత

ఒక వైపు బోధన మరో వైపు సేవా కార్యక్రమాలతో కొందరు ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..

వినూత్న రీతిలో గణిత బోధన

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో సీనియర్ గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.దావూద్ వినూత్న రీతిలో బోధిస్తూ ఏటా పదోతరగతిలో విద్యార్థులు గణితంలో అత్యుత్తమ మార్కులు సాధించేలా కృషి చేస్తున్నారు. ముఖ్యంగా పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ లాంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సులభ పద్ధతిలో గణితం బోధించడం ఆయన ప్రత్యేకత. కాగా సోమవారం జేవీవీ ఆధ్వర్యంలో దావూద్‌ను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి సన్మానించారు.

వేతనంలో 45 శాతం సామాజిక సేవకే ఖర్చు

కళ్యాణదుర్గం: ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ సామాజిక సేవ చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు ఓ ఉపాధ్యాయుడు బద్దేనాయక్. 2012 డీఎస్సీలో ఉద్యోగం సాధించి శెట్టూరు మండలం కైరేవులో మొట్టమొదటిగా ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం మాకొడికి జెడ్పీహెచ్ఎస్‌లో హిందీ పండిట్‌గా పనిచేస్తున్నాడు. ఆపదలో ఉన్నాం...ఆదుకోండి అన్న పిలుపు వినగానే బాధితుల ముంగిట ప్రత్యక్షమవుతాడు. కైరేవుకు చెందిన కావ్య అనే విద్యార్థిని గుండె శస్త్ర చికిత్సకు, అకాల వర్షాలతో సర్వం కోల్పోయిన నూర్‌బాషా కుటుంబానికి, అనంతపురంలోని ఓ చిన్నారికి, కేన్సర్ బాధితులకు, బ్లాక్ ఫంగస్ బాధితుడికి, అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు, ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందిస్తూ... ఇలా ఎన్నో కుటుంబాలకు తనవంతుగా చేదోడు...వాదోడుగా ఉంటూ నిత్యావసర సరుకులు, నగదు ఇచ్చి ఆపద్బాంధవుడిగా నిలిచాడు. ఇలా తనకు వచ్చే జీతంలో 45 శాతం డబ్బును సామాజిక సేవకే ఖర్చు చేస్తున్నాడు. ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా విశిష్ట సేవా అవార్డు అందుకున్నాడు.

సేవలతో గుర్తింపు

రాయదుర్గం: మండలంలోని చదం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న హేమలత ఎన్నో కార్యక్రమాలు చేపట్టి అందరి మన్ననలు పొందారు. 1996 లో ఉపాధ్యాయ వృత్తిలో చేరి, రాయదుర్గం, ఉడేగోళం, 75 వీరాపురం, మల్లాపురం, చదం పాఠశాలల్లో విధులు నిర్వహించారు. 2002లో నిజామాబాద్ జరిగిన రాష్ట్ర స్థాయి నెట్ బాల్స్ క్రీడా పోటీలకు రాయదుర్గం బాలికల పాఠశాల నుంచి విద్యార్థులను తీసుకెళ్లి విజేతగా నిలపడంలో ఎంతో కృషి చేశారు. అలాగే రాయదుర్గం, 75 వీరాపురం పాఠశాలల విద్యార్థులను జిల్లా స్థాయిలో నిర్వహించే సైన్స్‌ఫేర్ పోటీల్లో సత్తాచాటేలా తీర్చిదిద్దారు. 75 వీరాపురంలో సావిత్రిబాయ్ పూలే నాటిక, మ్యూజికల్‌చైర్స్, కల్చరల్ ప్రోగ్రామ్స్, పౌరాణిక పారాయణాలు, తోలుబొమ్మల ప్రదర్శనపై అవగాహన కల్పించడంతోపాటు బాల్య వివాహాల నిర్మూలన, డ్రాపౌట్స్ తగ్గింపు, మొక్కలు నాటడంపై ఎంతో కృషి చేశారు. పేద పిల్లలకు తనవంతుగా కుట్టు మిషన్లు అందించారు. రాయదుర్గం భవిత కేంద్రంలో రెండేళ్లుగా సామగ్రి అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇలా విద్యాతో పాటు ఎన్నో కార్యక్రమాలు చేపట్టి పనిచేసిన ప్రతి చోట అందరి మన్ననలు పొందడంతో గత ఏడాది రాష్ట్రస్థాయి అవార్డు సొంతం చేసుకున్నారు.

క్రీడా సామగ్రి వితరణ

బెళుగుప్ప: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, క్రీడాకారుడు బిల్లా నవీన్‌రెడ్డి క్రీడాసామగ్రి వితరణ చేశాడు. సుమారు రూ.14,000 విలువైన ఆట వస్తువులను విద్యార్థులకు ఎంఈఓ మల్లారెడ్డి చేతుల మీదుగా సోమవారం అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 హరికృష్ణ, ప్రధానోపాధ్యాయుడు వెంకటప్రసాద్, పీఈటీ రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి మూగజీవాల బలి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు, ఎల్‌బీ నగర్ గ్రామాల్లో విద్యుత్ ఘాతానికి రెండు గొర్రెలు, ఒక మేక మృత్యువాత పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఒక్కో జీవం విలువ రూ.13 వేలు ఉంటుందని బాధితులు నేమకల్లు గ్రామానికి చెందిన బోయ రమేష్,ఎల్‌బీ నగర్‌లో గోరంట్ల వెంకటేశులు వాపోయారు.